క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన



సదుం: అర్చకుల ఆధ్వర్యంలో హోమాలు

సదుం: స్థానిక వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో నూతన నాగరాళ్ల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈసందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. కార్య క్రమానికి ఎల్లారెడ్డి, నాగభూషణంరెడ్డి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోడ కూల్చారని ఫిర్యాదు



గడ్డివామును తొలగించి చదును చేసిన ప్రాంతం

సాక్షి టాస్క్‌ఫోర్స్: రామకుప్పం మండలంలోని పచ్చారమాకులపల్లిలో గోడ కూల్చారని రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితురాలు శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే నం:15/3లో తనకు చెందిన భూమిలో గోడ, గడ్డివామును అదే గ్రామానికి చెందిన క్రిష్టప్ప దౌర్జన్యంగా కూల్చినట్లు తెలిపారు. క్రిష్టప్ప సహా మరో ఐదుగురు తమపై దౌర్జన్యం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాదర్‌ఖాన్ మృతి



ఖాదర్‌ఖాన్(ఫైల్)

పుంగనూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పి.ఖాదర్‌ఖాన్(92) అనారోగ్యంతో సోమవారం మధ్యాహ్నం మృతిచెందారు. పంచాయతీ, మున్సిపాలిటీ ఆవిర్భావం నుంచి వార్డు మెంబరుగా, కౌన్సిలర్‌గా ఎన్నికై, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కొనసాగారు. ఓటమి ఎరుగని నాయకుడిగా పట్టణంలో అందరి మన్ననలు పొందారు. రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఖాదర్‌ఖాన్ మృతిచెందడంతో పలువురు విచారం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సంతాపం..

విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ఫోన్ ద్వారా ఖాదర్‌ఖాన్ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. విషయం తెలిసిన వెంటనే పట్టణ ప్రముఖులు, వైఎస్సార్‌సీపీ నేతలు ఫక్రుద్దీన్‌షరీఫ్, అయాబ్‌ఖాన్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చెకుముకి సైన్స్ సంబరాలు

తిరుపతి ఎడ్యుకేషన్: జన విజ్ఞాన వేదిక(జేవీకే) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు–2024ను నిర్వహించనుందని జేవీకే నాయకులు రెడ్డెప్ప, బిర్లానాయుడు తెలిపారు. తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను సెప్టెంబర్ 25వ తేదీన, మండల స్థాయిలో అక్టోబర్ 1న, జిల్లా స్థాయిలో అక్టోబర్ 10వ తేదీన, రాష్ట్రస్థాయిలో నవంబర్ 9, 10వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేవీకే నాయకులు లక్ష్మీనారాయణ, యూటీఎఫ్ నాయకులు ముత్యాలరెడ్డి, నిర్మల, మురళి, బండి మధుసూదన్‌రెడ్డి, రవి, బాల పాల్గొన్నారు.

డ్వాక్రా బజార్ ప్రారంభం



డ్వాక్రా బజార్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకురాలు కోట దేవకి దేవి

తిరుపతి కల్చరల్: డ్వాక్రా మహిళా సంఘాల ఆధర్యంలో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ బజార్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన డ్వాక్రా మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను స్టాల్స్ ద్వారా ఏర్పాటు చేశారు. మహిళలు మెచ్చే అన్ని రకాల గృహోపలంకరణలు, వస్త్రాలు, ఆట బొమ్మలు, చేతి వృత్తుల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. అంతేకాక పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు జాయింట్ వీల్, బ్రేక్ డాన్స్ వంటివి ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌ను ప్రజలు తిలకించి మరింత ప్రోత్సహించాలని నిర్వాహకురాలు కోటదేవకి దేవి తెలిపారు.



డాక్టర్లకు ముందు రక్షణ ఉండాలి కదా?



ప్రజల ప్రాణాలను కాపాడే మాకే రక్షణ లేనప్పుడు ఇంట్లో తల్లిదండ్రులు కూడా మా గురించి ఆందోళన చెందరా? కోల్‌కతా సంఘటనతో ఆస్పత్రుల్లో భద్రత లేదనే విషయం మరోసారి చాటిచెప్పినట్టింది. ప్రభుత్వం కచ్చితంగా రక్షణ చర్యలు తీసుకోవాలి. మేమంతా ప్రశాంతంగా ఉంటేనే కదా రోగులకు సేవలందించేందుకు వీలవుతుంది. ముఖ్యంగా రాత్రుల్లోనే ఇబ్బందిగా ఉంటుంది.

–డాక్టర్ వసుధ, జనరల్ సర్జన్, పలమనేరు

భద్రత లేకుంటే సేవలు కష్టం



ఆస్పత్రుల్లో రోగుల సేవల కోసం 24 గంటలు పనిచేసే మమ్మల్ని టార్గెట్ చేస్తే పరిస్థితి ఏంటి? అందుకే ఆస్పత్రుల్లో తగిన భద్రత చాలా ముఖ్యం. కోల్‌కతా సంఘటన జరిగాక మాకు కూడా చాలా భయమేస్తోంది.ప్రభుత్వం దీనిపై తక్షణమే స్పందించాలి.

–విజయకుమారి, హెడ్ నర్స్, పలమనేరు

రాత్రుల్లో ఆస్పత్రికి రావాలంటే భయం...



ఏరియా ఆస్పత్రిలో నా షిఫ్ట్ అయ్యాక ఇంటికెళ్లి ఏ అర్ధరాత్రో ఏదైనా డెలివరీ కేసు సర్జరీ చేయాలని ఫోన్ వస్తుంది. ఇంట్లో మా కుటుంబ సభ్యులుంటే ఆస్పత్రికి వస్తాం. లేనపుడు రాత్రుల్లో ఆస్పత్రికి ఒంటరిగా రావాలంటే ఎలాంటి పరిస్థితో అర్థం చేసుకోండి. కాబట్టి వైద్యులకు విధిగా భద్రత కల్పించాలి.

–డాక్టర్ శ్యామలాదేవి, గైనకాలజిస్ట్, పలమనేరు

ఇక్కడ వెలవెల.. అక్కడ కళకళ



వెలవెలపోతున్న ఏపీ పెట్రోల్ బంకు



కర్ణాటకలో కిటకిటలాడుతున్న పెట్రోల్ బంకు

- సరిహద్దుల్లో పెట్రోల్ బంకులు మూత
- బంకుల్లో వినాయకుని విగ్రహాల అమ్మకాలు
- ఏపీ, కర్ణాటకకు పెట్రోల్ రేట్లలో వ్యత్యాసమే కారణం

పలమనేరు నియోజకవర్గంలో కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లోని పలు పెట్రో బంకులు మూతపడగా మరికొన్ని వ్యాపారాలు లేక వెలవెలబోతున్నాయి. పొరుగునే ఉన్న కర్ణాటకలో పెట్రోల్, డీజిల్ ధరలు తక్కువగా ఉండడంతో సరిహద్దులోని ఆ బంకులకు వెళ్లి పెట్రోల్, డీజిల్ పట్టించుకుంటూ ఉండడంతో ఇక్కడి వాళ్ల వ్యాపారం పడిపోయింది. చివరకు బంకుల నిర్వహణ భారమై కొన్నింటిని మూసివేశారు. మరికొన్ని యాచకులకు ఆవాసాలుగా మారాయి. మరికొందరు పశువుల కొట్టంలా వాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వినాయకచవితి వస్తోంది. కొందరు వ్యాపారులు ఖాళీగా ఉన్న ఈ బంకుల ప్రాంతంలో వినాయక విగ్రహాలను కొలువుదీర్చి అమ్మకాలకు తెరదీశారు. ఆ మార్గంలో వెళ్లే వారు పెట్రోల్ బంకుల్లో వినాయకుని విగ్రహాలేమిటబ్బా!. అని ఆసక్తిగా చూస్తున్నారు.

పలమనేరు: నియోజకవర్గంలోని గంగవరం మండలానికి ఆనుకుని గండ్రాజుపల్లె గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో కర్ణాటక రాష్ట్రం ఉంది. అలాగే, మండల కేంద్రమైన వి.కోట టౌన్‌కు ఆనుకునే కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ఉంది. దీంతో ఏపీలోని వాహనదారుల కోసం కర్ణాటక వారు పదుల సంఖ్యలో సరిహద్దుల్లో పెట్రోల్ బంకులను నిర్వహిస్తున్నారు. ఇక వి.కోట మండలం నుంచి రామకుప్పం మండలం రాజుపేట దాకా రోడ్డుకు ఓ వైపు కర్ణాటక రాష్ట్రం ఉండడంతో పదుల సంఖ్యలో ఆ రాష్ట్ర బంకులున్నాయి. దీంతో ఇక్కడి వాహనదారులు అక్కడ ధరలు తక్కువ కాబట్టి కర్ణాటక పెట్రోలు బంకుల్లోనే ఇంధనాన్ని నింపుకుంటున్నారు.

పెట్రోల్ లీటర్‌కు రూ.6, డీజిల్ రూ.12 తక్కువ

కర్ణాటక రాష్ట్రానికి చెందిన బంకుల్లో ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర రూ.109.44 పైసలుగా ఉంది. అదే ఏపీలోని బంకులో రూ.103.44గా ఉంది. దీంతో పెట్రోల్‌పై లీటర్‌కు అక్కడ రూ.6 తక్కువగా ఉంది. అదే డీజిల్ అక్కడ లీటర్ రూ.89.37గా ఉండగా ఏపీలో రూ.97.39గా ఉంది. దీంతో లీటర్ డీజిల్‌పై రూ.12 దాకా వ్యత్యాసం ఉంది. ఫలితంగా ఇక్కడి బైక్‌లు, కార్లు, ట్రాక్టర్లు, లారీలు, టెంపోలు, ఆటోలు కర్ణాటక బంకుల్లో ఇంధనాన్ని నింపుకుంటున్నాయి. ఫలితంగా మన రాష్ట్రంలోని బంకులకు ఎవరూ వెళ్లడం లేదు. దీంతో మన రాష్ట్రానికి చెంది బంకుల వ్యాపారాలు లేక కొన్ని వెలవెలబోతుండగా 14 దాకా మూతపడ్డాయి.

ఏపీ బంకుల పరిస్థితి ఘోరం

కర్ణాటకలో డీజిల్, పెట్రోల్ ధరలకు ఏపీకి ధరల తేడాపై గతంలో ప్రతిపక్షనేతగా ఇక్కడికి వచ్చిన చంద్రబాబు దీనిపై నానా హంగామా చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కర్ణాటక వాళ్లు ఏపీలో ఆయిల్ కొనేలా చూస్తామన్నారు. ఇప్పుడు కూటమి అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్ర పన్నుల విషయంగా కర్ణాటకకు కంటే ఏపీలో ఆయిల్ ధరలు ఎక్కువగానే ఉన్నాయి. దీంతో నాడు చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలు నీటి మూటలేనని తేలిపోయింది. ఏదేమైనా సరిహద్దుల్లోని మన పెట్రోల్ బంకుల నిర్వహణ భారమై నిర్వాహకులు 20 దాకా బంకులను ఆపేశారు. కొన్ని శిథిలావస్థకు చేరాయి. కొన్ని బంకులను రకరకాల వ్యాపారాల కోసం అద్దెలకిచ్చేశారు.

కర్ణాటక బంకుల్లోనే పెట్రోల్ పట్టుకుంటా..



కర్ణాటకలో లీటర్ పెట్రోల్‌కు రూ.6 దాకా మిగులుతుంది. కాబట్టి అందుకోసమే నేను గండ్రాజుపల్లికి దాటి కర్ణాటకకు వెళ్లి అక్కడ ఫుల్‌ట్యాంకు పెట్రోల్ పట్టుకుంటా. దీంతో 30 లీటర్లకు రూ.180 దాకా మిగులుతుంది.

–టైలర్ భాస్కర్, వద్దూరు, పలమనేరు మండలం

ఏపీలో పట్టేదేలేదు..



నేను కారు కొన్నప్పటినుంచి ఏపీలో పెట్రోల్ పట్టేదేలేదు. ఎందుకంటే కర్ణాటకలో ధరలు తక్కువ కాబట్టి సరిహద్దుకు వెళ్లి ఫుల్ ట్యాంకు చేసుకుంటాం. నేనే కాదు ఇక్కడి ట్రాక్టర్ల రైతులు, లారీ, టెంపోవాళ్లు కూడా అక్కడే పట్టుకుంటారు. ఎందుకంటే ఆయిల్ ధరలు తక్కువగా ఉన్నాయి.

–మోహన్‌రెడ్డి, చింతలగుంట, బైరెడ్డిపల్లి మండలం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బంగారుపాళెం: మండల పరిధిలోని ఆండారెడ్డిపల్లె వద్ద జాతీయ రహదారిపై గుంతలో పడి ఇద్దరు ద్విచక్ర వాహనదారులు గాయాల పాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, రహదారిపై మురుగు ప్రవహించడంతో గుంతమయంగా మారింది. ఈ గుంతల్లో ద్విచక్ర వాహనదారులు పడి గాయపడుతున్నారు. ఇప్పటికే పలువురు గాయపడ్డారు. అదే క్రమంలో సాయంత్రం ఇద్దరు వ్యక్తులు బైక్ మీద ప్రయాణిస్తూ ఈ గుంతలో పడి గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నారు.

రుయాలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ చలపతి రెడ్డి

తిరుపతి తుడా: జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను సోమవారం తిరుపతి రుయా ఆస్పత్రి కంటి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రుయాలో అవగాహన కల్పించి, రోగులకు కంటి పరీక్షలు చేశారు. రుయా కంటి విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి రోగులను ఉద్దేశించి మాట్లాడారు. నేత్రదానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒక వ్యక్తి నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు అంధ్రులకు కంటి చూపును ప్రసాదించవచ్చన్నారు. మరణాంతరం 8 గంటల వ్యవధిలోపు నేత్రాలను దానం చేయవచ్చన్నారు. నేత్రదానాన్ని కుటుంబ సంప్రదాయంగా మార్చుకోవాలని ఆయన హితువు పలికారు. కార్యక్రమంలో కంటి విభాగ వైద్యాధికారులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు పీజీ వైద్య విద్యార్థులు, రోగులు, వారి సహాయకులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై పోలీసుల ఉక్కుపాదం

- ఎస్పీ ఆదేశాలతో పంజా విసురుతున్న స్పెషల్ బ్రాంచ్
- వారంలో నాలుగు ముఖ్యమైన దాడులు
- పలు అక్రమాలపై మళ్లీ డేగకన్ను

పలమనేరు: జిల్లాలో చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్న అక్రమార్కులపై స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎస్పీ ఆదేశాలతో స్థానిక అక్రమాలపై నిఘా విభాగం దాడులు చేస్తోంది. దీంతో పాటు మరిన్ని అక్రమాలపై వారు ఇప్పటికే కీలక సమాచారాన్ని సేకరించినట్టు తెలిసింది. జిల్లాలో రేషన్ బియ్యం స్మగ్లింగ్‌కు సంబంధించిన బడా స్మగ్లర్ కిరణ్‌కుమార్ అక్రమాలపై వీరు ప్రత్యేక నిఘా పెట్టినట్టు సమాచారం. ఈ మధ్య వారం రోజుల్లోనే పలమనేరు సబ్‌డివిజన్‌లో రూ.3.5లక్షల విలువచేసే కర్ణాటక మద్యాన్ని పట్టణంలో పట్టుకున్నారు. ఇందులో కీలక నిందితుడైన పుంగనూరు రాజేష్‌పై కేసు నమోదు చేశారు. రెండ్రోజుల క్రితం పట్టణ సమీపాల్లోని అక్రమ టపాకాయల నిల్వ కేంద్రాలపై దాడులు చేసి పదిలక్షలు విలువచేసే టపాకాయలను సీజ్ చేశారు. తాజాగా ఆదివారం ఉమ్మడి జిల్లాలో రేషన్ స్మగ్లింగ్ డాన్ అరగొండ కిరణ్‌కుమార్‌కు చెందిన బియ్యం లారీని పలమనేరులో పట్టుకున్నారు. ఆపై తవణంపల్లె మండలంలోని కిరణ్‌కుమార్ అక్రమ గోడౌన్‌పై ఎస్పీ ఆదేశాలతో దాడులు చేపట్టి అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం, స్మగ్లింగ్‌కు చేసే బొలేరో వాహనాలను సీజ్ చేశారు. జిల్లాలో సాగుతున్న అక్రమాలపై ఎస్పీ ఆదేశాలతో స్పెషల్ బ్రాంచి కత్తికి పదును పెట్టి మరిన్ని అక్రమాలను రట్టు చేయడం కచ్చితంగా కనిపిస్తోంది. దీంతో పోలీస్‌శాఖలోనూ అక్రమాలను అరికట్టాలనే ప్రయత్నాలు మొదలైనట్టు తెలుస్తోంది.



పోలీసులు పట్టుకున్న కర్ణాటక మద్యం (ఫైల్)

పుంగనూరులో కుక్కల బెడద

పుంగనూరు: పట్టణంలో వీధి కుక్కల బెడద తీవ్రం కావడంతో ప్రజలు హడలిపోతున్నారు. పట్టణంలోని రహ్మత్‌నగర్, ఉబేదుల్లా కాంపౌండు, ఎల్‌ఐసీ కాలనీ, షిరిడీ సాయినగర్, ఎన్‌ఎస్.పేట, కుమ్మర వీధి ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ద్విచక్రవాహనాలు, పాదచారులు వచ్చిపోయే సమయంలో కుక్కలు వెంటపడడం, కరవడంతో ప్రజలు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నపిల్లలను సైతం వీధి కుక్కలు కరుస్తుండంతో ఏ నిమిషానికి ఏం జరుగుతుందోనన్న భయం పట్టణ ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వెంటనే చర్యలు తీసుకుని, వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పుంగనూరులో స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కలు

హరే కృష్ణ హరే కృష్ణ..





పుంగనూరు: శ్రీకృష్ణాలయంలో శ్రీకృష్ణ భగవానుడు, వి.కోట: అలంకరణలో వేణుగోపాలస్వామి



ఊరేగింపులో కోలాటాల సందడి

- ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

వి.కోట: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే రామాపురంలో ప్రబోధ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రుక్మిణి సత్యబామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులను పట్టణ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: శంకర్రాయలపేట గ్రామంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవర ఎద్దును, ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చిన యాదవ కుటుంబాలు శంకర్రాయలపేట, గుట్టూరు, శివాడి గ్రామంలోని పురవీధుల్లో కోలాటాలు, చెక్కభజనల నడుమ ర్యాలీ చేశారు. భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: కృష్ణాష్టమి సందర్భంగా భక్తుల నడుమ శ్రీకృష్ణుని ఊరేగింపు పట్టణంలో వైభవంగా నిర్వహించారు. అలాగే సోమవారం స్థానిక శ్రీకృష్ణాలయంలో స్వామివారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. యాదవులచే ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.

సదుంలో...

సదుం: చింతలవారిపల్లెలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని బసవన్నగుడి ఆలయంలో భగవద్గీతపై పిల్లలకు అవగాహన కల్పించి ఇందుకు సంబంధించిన పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. స్థానిక త్రైత సిద్ధాంత ప్రబోనానంద స్వామి భక్తులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలో కృష్ణుడి ఊరేగింపు జరిగింది. ఇదే కన్నమాకులపల్లిలో స్వామివారి కల్యాణోత్సవం కన్నులపండుగలా నిర్వహించారు.



వి.కోట: పూజలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

గంగవరంలో..

గంగవరం: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు సంప్రదాయ దుస్తులతో శ్రీకృష్ణ, గొల్లభామల వేషధారణలో అలరించారు. గోకులాష్టమి సందర్భంగా కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో స్వామివారు శ్రీకృష్ణావతారంలో తిరుచ్చిపై విహరించినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు.

బైరెడ్డిపల్లిలో..

బైరెడ్డిపల్లె: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల విగ్రహాలను విశేషంగా తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు చేపట్టారు. చిన్నారులు గోపిక, శ్రీకృష్ణుడు వేషధారణలో అలరింపజేశారు.

కుప్పంలో..

కుప్పం: గుడుపల్లె రోడ్డులో వెలసిన శ్రీ కృష్ణార్జున దేవాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం మహల్‌లో యాదవ సంఘ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

కుప్పంలో..

కుప్పంరూరల్: శ్రీకృష్ణాష్టమి వేడుకలను కుప్పం ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా చేశారు. సోమవారం ఉదయం ప్యాలెస్ వద్ద స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కన్నమాకులపల్లిలో స్వామి వారు



చింతలవారిపల్లెలో శ్రీకృష్ణుని ప్రతిమ



కుప్పం: వేడుకల్లో భక్తులు





పెద్దపంజాణి: ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



పలమనేరు: స్వామివారి ఊరేగింపు



పుంగనూరు: శ్రీకృష్ణ ఆలయం వద్ద భక్తుల సందడి, పలమనేరు: పసుపును రోకలితో దంచుతున్న యువతులు